క్లుప్తంగా

బక్రీద్ శుభాకాంక్షలు


మాజీ ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ ప్రతి ఒక్కరూ దైవ ప్రవక్త బోధనలను అనుసరించాలని గుర్తుచేస్తుందన్నారు. తోటి మనుషుల పట్ల కరుణ, త్యాగం, సహనంతో వ్యవహరించడానికి ఈ పండుగ స్ఫూర్తి కలిగిస్తుందని వైవీఆర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చదరంగంలో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులు

గుంతకల్లు: పట్టణంలోని నిజాం కంప్యూటర్ ట్రెనింగ్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన చదరంగం పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభను చాటారు. అండర్–16 ఓపెన్ స్కూల్ టోర్నీలో వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 31 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో యువరాజ్ కార్వా, రాఘవ, ఉదయ్, బాలాజీ, ఉపేంద్ర ప్రతిభ కనబరిచారు. వారికి ముఖ్యఅతిథి డాక్టర్ హిమబిందు జ్ఞాపికలను అందజేశారు.

ఎఫ్‌సీఐ కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా విజయలక్ష్మి



గుంతకల్లుటౌన్: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) కన్సల్టేటివ్ కమిటీ సభ్యురాలిగా గుంతకల్లుకు చెందిన బీజేపీ మహిళా మోర్చా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.విజయలక్ష్మిని నామినేట్ చేస్తూ కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆదివారం ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. రెండు సంవత్సరాల పాటు భారత ఆహార సంస్థ సంప్రదింపుల కమిటీలో ఏపీ తరఫున సభ్యురాలిగా కొనసాగనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి సంస్థ అభివృద్ధికి సహకారమందిస్తానని ఆమె తెలిపారు.

అభివృద్ధిలో పోటీతత్వం ఉండాలి


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా

పెద్దపప్పూరు: ఆధిపత్యం కోసం పాకులాడితే జీవితాలు దెబ్బతింటాయని, అదే తోటివారి కన్నా బాగుండాలనే పోటీతత్వం ప్రతి ఒక్కరిలో ఉంటే గ్రామం అభివృద్ధి చెందుతుందని ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గౌస్‌బాషా సూచించారు. ఆదివారం సమస్యాత్మక గ్రామం వరదాయల్లిలో ఆయన గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. పిల్లల భవిష్యత్ పెద్దలపై ఆధారపడి ఉంటుందన్నారు. రాజకీయాలు శాశ్వతం కాదని పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రవర్తన మార్చుకుంటే జీవితాలు మెరుగుపడతాయన్నారు.ఎటువంటి సమస్య వచ్చినా పోలీసుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

ఆయా ఆచూకీ లభ్యం


దేవి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లికి చెందిన అంగన్‌వాడీ ఆయా దేవి రెండు రోజుల క్రితం కుటుంబ కలహాల కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు దేవి అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో ఆదివారం దేవిని బత్తలపల్లిలో గమనించిన వారు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు బత్తలపల్లికి వెళ్లి ఆమెను అదుపులోకి తీసుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మిద్దెపై నుంచి పడి యువకుడికి గాయాలు


గాయపడిన లోకేష్

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎస్ పల్లి (సూరశింగనపల్లి)లో లోకేష్ అనే యువకుడు ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆర్టీసీ అధికారుల తాడాట

- బస్టాండ్‌లోకి వెళ్లేందుకు ప్రయాణికులకు అడ్డంకులు
- చెక్‌పోస్ట్ గేట్ మెన్‌లుగా డ్రైవర్ల డ్యూటీ


బస్టాండ్‌లోకి వెళ్లకుండా తాడు అడ్డుగా కట్టి ప్రయాణికులను నిలిపిన దృశ్యం

గుంతకల్లు: ప్రయాణికుల పట్ల ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదస్పదమవుతోంది. అధికారుల తీరుతో ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌లోకి ప్రవేశించడం కష్టసాధ్యమతోంది. గత కొన్ని రోజులుగా ఆర్టీసీ అధికారులు గుంతకల్లు ఆర్టీసీ బస్టాండ్ ఎంట్రన్స్, ఎగ్జిట్ మార్గాల్లో అడ్డంగా తాళ్లు కట్టి ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. రోజూ వందల సంఖ్యలో ప్రయాణికులు తమ కుటుంబీకులు, బంధుమిత్రులను ద్విచక్ర వాహనాల్లో తీసుకువచ్చి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణం కోసం దిగబెడుతుంటారు. అలాగే తమ వారిని రిసీవ్ చేసుకునేందుకు అనేక మంది ద్విచక్రవాహనాలను తీసుకుని బస్టాండ్‌కు వస్తుంటారు. అలాగే చాలా మంది వర్తకులు, ఉద్యోగులు తమ ద్విచక్రవాహనాలను ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని స్కూటర్ స్టాండ్‌లో రుసుం చెల్లించి పార్కు చేస్తుంటూరు. అయితే ఏమైందో తెలియదు కానీ, గత కొన్ని రోజులుగా బస్టాండ్‌లోనికి వెళ్లే మార్గాలకు (గుత్తి, ఉరవకొండ వైపు) అడ్డంగా తాళ్లు కట్టి ద్విచక్రవాహనాదారులను ఆర్టీసీ సిబ్బంది అడ్డుకుంటున్నారు. వచ్చే బస్సులు, పోయే బస్సులకు మాత్రం తాళ్లు తీసి పంపిస్తున్నారు. పైగా ఈ రెండు చెక్‌పోస్టుల వద్ద ఆర్టీసీ డ్రైవర్లను విధుల్లో ఉంచారు. దీంతో తమ వారిని బస్టాండ్‌లో దించేందుకు, పికప్ చేసుకునేందుకు వచ్చే ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. కాలినడకన బస్టాండ్‌లోనికి వచ్చే ప్రయాణికులను సైతం ఈ చెక్‌పోస్టుల వద్ద అడ్డుకుంటూ చుక్కలు చూపిస్తున్నారు. ఇక బస్టాండ్ ప్రాంగణంలోని పార్కింగ్ స్థలంలో ద్విచక్రవాహనాలను పార్కు చేయడం వాహరదారులకు పెద్ద సవాలుగా నిలుస్తోంది. తాము ద్విచక్రవాహనాలకు రుసుం చెల్లించి కూడా బస్టాండ్‌లోకి వెళ్లలేకపోతున్నామని, పార్కు చేసిన వాహనాలను బయటకు తెచ్చుకోవడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు. అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న ఆర్టీసీ గుంతకల్లు అధికారుల వైఖరి వల్ల మరింత దిగజారిపోతోందని ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రోజూ ఈ అనధికార చెక్‌పోస్టుల వద్ద షిఫ్టుల ప్రకారం డ్రైవర్లను నియమిస్తూ సంస్థ నియమ నింబంధనలను సైతం గుంతకల్లు అధికారులు బేఖాతరు చేస్తుండడం గమనార్హం. ఆర్టీసీ బస్టాండ్ దారులను దేశ సరిహద్దులుగా అధికారులు మార్చివేశారని ప్రయాణికులు వ్యాఖ్యానిస్తున్నారు. గుంతకల్లు అధికారుల ఈ తాడాట సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది.

బయటకు ఎలా వెళ్లాలి?



గుత్తికి వెళ్లేందుకు ద్విచక్ర వాహనంలో ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చి, లోపలికి వెళ్లే ముందు పర్మిషన్ తీసుకుని స్కూటర్ స్టాండ్‌లో పార్కింగ్ చేశాను. తిరిగి వెళ్లే సమయంలో నన్ను ఆపి అటువైపు నుంచి రావాలని ఆదేశించారు. అటు వైపు వెళ్లాలన్నారు. అక్కడ కూడా ఇదే పరిస్థితి. ఇలా అయితే బయటకు ఎలా వెళ్లాలి.

– రంగ, ద్విచక్ర వాహనదారుడు, గుంతకల్లు

ప్రమాదాల నివారణ కోసమే..

గత ఏప్రిల్‌లో బస్టాండ్‌లో ద్విచక్రవాహనదారుడు లోపలి వచ్చే క్రమంలో జరిగిన ప్రమాదం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. గుత్తి, ఉరవకొండ వెలుపలకు వెళ్లే మార్గాల్లో స్పీడ్ బ్రేకర్లు అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా అనుమతి వచ్చింది. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి తాళ్లను తీసివేస్తాం. ఫిట్‌నెస్ లేని డ్రైవర్లుకు అక్కడ డ్యూటీలకు వేశాం.

– నారాయణస్వామి, ఆర్టీసీ డిపో మేనేజర్

రూ. 2.61 కోట్ల లాభాల్లో టౌన్ బ్యాంకు


మాట్లాడుతున్న టౌన్ బ్యాంకు చైర్మన్ అబ్దుల్ జిలాన్

గుత్తి: గుత్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు రూ. 2.61 కోట్ల లాభాల్లో ఉందని ఆ బ్యాంకు చైర్మన్ అబ్దుల్ జిలాన్ అన్నారు. పట్టణంలోని గుత్తి ఆర్ఎస్ రోడ్డులో ఉన్న వసుధ ఫంక్షన్ హాల్లో ఆదివారం టౌన్ బ్యాంకు సర్వ సభ్య సమావేశం (101వ వార్షిక మహా సభ) నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కష్టమర్లు, బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది, డైరెక్టర్ల కృషి ఫలితంగా బ్యాంకు లాభాల్లో ఉందన్నారు. ప్రస్తుతం షేర్ హోల్డర్స్ 4,363 మందిఉన్నారన్నారు. బ్యాంకును మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం కష్టమర్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు సీఈఓ మహేశ్వర ప్రసాద్, బ్యాంకు వైస్ చైర్మన్ రాము, డైరెక్టర్లు కృష్ణ, మధు, నాగరాజు, అంగడి నాగరాజు, నాగరంగప్రసాద్, మాబు తదితరులు పాల్గొన్నారు.


అప్పటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 1989–90 బ్యాచ్ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాఠశాలలో విద్యార్థులు ఒకరికొకరు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి రామచంద్రారెడ్డి, జయరామిరెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు రామలింగారెడ్డి, పసుపుల హనుమంతరెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయురాలు వసుంధర తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టుల తనిఖీ


గుత్తిలో చెక్ పోస్టు వద్ద పోలీసులతో మాట్లాడుతున్న డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లో బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక చెక్‌పోస్టులను గుంతకల్లు డీఎస్పీ శివ భాస్కర్‌రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. మొదట ఆర్ఎస్‌లోని చెక్ పోస్టు, అనంతరం గుత్తి చెక్ పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బక్రీద్ సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ముస్లింలు పండుగను సామరస్యంగా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీ రసూల్, సిబ్బంది పాల్గొన్నారు.

మదీనా కాలనీలో అపరిశుభ్రత


కాలనీలో వర్షపు నీరు నిల్వ ఉన్న దృశ్యం


కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం

పామిడి: ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతమైన మదీనాకాలనీలో ఇళ్ల నడుమ ఉన్న వర్షపు నీరు నిలిచి కంపుకొడుతోంది. నిల్వ ఉన్న వర్షపు నీరు విషపురుగులు, దోమలకు నిలయంగా మారాయి. దీంతో రాత్రి వేళ కాలనీవాసులు బయటకు రాలేకపోతున్నారు. వర్షపునీరు దోమలకు నిలయంగా మారడంతో వ్యాధుల భయం పట్టుకుంది. అలాగే గాలి బీభత్సానికి కాలనీలోనితో విద్యుత్ స్తంభం ఒకవైపుకు వంగిపోయింది. దీంతో స్తంభం ఎక్కడ కూలుతుందో? తద్వారా ఎటువంటి ప్రమాదం పొంచిఉందోనన్న? భయం కాలనీవాసులకు వెంటాడుతోంది. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.


వర్షపు నీటి ఉధృతికి బ్రిడ్జి కూలడంతో రహదారి దుస్థితి ఇలా..


గాండ్లపాడు వద్ద రాళ్లను అడ్డుగా పెట్టి ప్రమాద సూచిక ఏర్పాటు చేసుకున్న ప్రజలు

ప్రమాదకరంగా ప్రయాణం

పుట్లూరు: తాడిపత్రి–యల్లనూరు ప్రధాన రోడ్డుపై మండలంలోని గాండ్లపాడు, తిమ్మాపురం, శనగలగూడూరు గ్రామాల సమీపంలో వర్షానికి దెబ్బతిన్న రోడ్లు ప్రమాదకరంగా మారాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న బర్మ్‌లు కోతలకు గురికావడంతో రాత్రి సమయాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రోడ్డు కొత్తగా నిర్మించగా ఇరువైపులా బర్మ్‌ల ఏర్పాటు కోసం వేసిన మట్టి వర్షపునీటికి కొట్టుకొనిపోవడంతో గుంతలు ఏర్పాడ్డాయి. అలాగే ఎస్.తిమ్మాపురం వద్ద తక్కళ్లపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు వెళ్లే దారిలో ఉన్న బ్రిడ్జి పూర్తిగా కూలిపోయి ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి ప్రమాదాలు అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

గార్లదిన్నె: ఖరీఫ్ సీజనల్‌లో రైతులు పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పొలంలో భూసార పరీక్ష చేయించుకుని.. అందుకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలన్నారు. మేలైన దిగుబడులు పొందవచ్చునన్నారు. అలాగే వర్షాలు సమృద్ధిగా కురిస్తే జూలై 15 వరకూ వేరుశనగ పంట సాగు చేసుకోవచ్చునన్నారు. అదేవిధంగా అరకొర పదును అయితే రైతులు ప్రత్యామ్నాయ పంటలు కొర్ర, ఉలవలు, పెసర, అలసందులు, కంది వంటి పంటలు సాగు చేసుకవాలన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

బుక్కరాయసముద్రం: వేరుశనగ విత్తేటప్పుడు రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని ఏఓ శ్యాం సుందర్‌రెడ్డి సూచించారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు పంటల సాగు ముందు భూసార పరీక్షలు చేయించు కోవాలన్నారు. ఆ ఫలితాలు ఆధారంగా ఎరువులు, మందులు వాడాలన్నారు. అలాగే వేరుశనగ సాగు చేసే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. టికోడెర్మావిరిడితో విత్తనశుద్ధి వల్ల పంటకు ఆశించే తెగుళ్లను ముందుగానే నివారించుకోవచ్చన్నారు. తద్వారా మంచి దిగుబడి సాధించవచ్చన్నారు.

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: పట్టణంలోని సీఎస్ఐ చర్చిలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. సృష్టికర్త యెహోవా దేవుడన్నారు. పాపులను రక్షించటానికి ఈ లోకాన దైవ నరుడుగా ఉద్భవించిన యేసుక్రీస్తు ప్రభువు రక్షణకర్త అన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, అబ్రహాం, బుజ్జిబాబు, అల్లీపీరా, జయరాజు, దీపు చైతన్య, రాజు, మెర్సీ, మంజుల, చంద్రకళ, ఎలిజబెతమ్మ, ప్రిస్కిల్లా, సుశీలమ్మ, రేచెల్, డాక్టర్ కమల, మహిమ, లత, రమాదేవి పాల్గొన్నారు.

బక్రీద్ పండుగకు ఈద్గాల ముస్తాబు


గుత్తిలో ఈద్గాను శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది


ప్రార్థనలకు సిద్ధమైన శింగనమలచెరువు వద్ద ఉన్న ఈద్గా


విద్యుత్ దీపాలంకరణలో గుత్తి ఆర్ఎస్ సున్నీ రోషన్ మసీదు

గుత్తి రూరల్: ముస్లింల పవిత్రమైన బక్రీద్ పండుగ కోసం ఈద్గాలు ముస్తాబయ్యాయి. సోమవారం నిర్వహించే బక్రీద్ పండుగకు గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలోని ఈద్గాలను మున్సిపల్ సిబ్బంది ఆదివారం శుభ్రం చేశారు. ఈద్గాలలో పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్త, వ్యర్థాలు తొలగించారు. ఈ సందర్భంగా మసీదులు విద్యుత్ దీపాల కాంతులతో వెలిగిపోయాయి. గుత్తి ఆర్ఎస్‌లో సోమవారం ఉదయం 8 గంటలకు, గుత్తిలోని హుస్సేనీ మసీదులో ఉదయం 8.30 గంటలకు, గుత్తి పట్టణంలోని ఈద్గాలో ఉదయం 9 గంటలకు, మాల్దార్ మసీదులో ఉదయం 9.15 గంటలకు నమాజులు ఉంటాయని ముస్లిం మత పెద్దలు, మసీదు కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు.

శింగనమల: ముస్లింలు సోమవారం బక్రీదు పండుగను జరుపుకోనున్నారు. శింగనమలలో చెరువు వద్ద ఉన్న ఈద్గాను ముస్లింలు అలంకరించారు. మండలంలోని శింగనమల, సి.బండమీదపల్లి, గోవిందరాయునిపేట, సోదనపల్లి, ఈస్ట్ నరసాపురం, సలకంచెరువు గ్రామాలకు చెందిన ముస్లింలు శింగనమలలోని ఈద్గాలో ప్రార్థనలు నిర్వహించనున్నారు. అలాగే పెరవలి, తరిమెల, ఆకులేడు గ్రామాల్లో ఈద్గాలను ముస్లింలు అలంకరించారు.

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెతో పాటు మర్తాడు, కల్లూరు, పెనకచెర్ల డ్యాం, యర్రగుంట్ల గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకునేందుకు ముస్లింలు ఏర్పాట్లు పూర్తి చేశారు.ఆయా గ్రామాల్లో మసీదులు, ఈద్గా మైదానాల్లో నమాజ్ కోసం ఏర్పాట్లు చేశారు. అలాగే గ్రామాల్లో బక్రీద్ పండుగ ప్రశాతంగా జరుపుకోవాలని ముస్లింలకు పోలీసులు సూచించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

గార్లదిన్నె: మండలంలోని తలగాచిపల్లి సమీపంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను ఆదివారం గార్లదిన్నె పోలీసులు పట్టుకున్నారు. శింగనమల మండలం ఉల్లికల్లు నుంచి టిప్పర్‌లో ఇసుక లోలూరుకు తరలిస్తుండగా తలగాచిపల్లి వద్ద టిప్పర్‌ను ఆపి పోలీసులు రికార్డులు పరిశీలించారు. అనుమతి లేకపోవడంతో టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

నారాయణుడికి ప్రత్యేక పూజలు


అలంకరణలో శింగరబట్లు, గణపతి, అశ్వర్థనారాయణస్వామి

పెద్దపప్పూరు: దక్షిణకాశీగా మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణస్వామిని ఆదివారం వివిధ ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్‌కుమార్ శర్మ క్షేత్రంలోని శింగరబట్లు, గణపతి, అశ్వత్థ నారాయణుడు, అభనాంజనేయస్వామి, శ్రీవల్లి సుబ్రమణ్య, చక్రభీమలింగేశ్వర స్వాములను ప్రత్యేకంగా అలంకరించారు. కోర్కెలు నెరవేరిన భక్తులు బియ్యం, బేడలు, ముడుపులు, కానుకలతోపాటు తలనీలాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం, సోమవారం ఎక్కువ మంది భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి వస్తుంటారని స్థానికులు తెలిపారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

అమ్మవారిశాలల్లో పూజలు


అలంకరణలో ముసలమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట సమీపంలో ఉన్న కాశీ విశ్వేశ్వర దేవాలయం, ముసలమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ముసలమ్మ తల్లి, కాశీ విశాలాక్షి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు ఆలయంలో దీపాలు పెట్టి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా దశమి పూజలు


అలంకరణలో తిమ్మప్పస్వామి

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులోని గద్దెరాళ్ల కొండపై వెలసిన తిమ్మప్ప స్వామి ఆలయంలో ఆదివారం దశ పాపహర దశమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి మహాలక్ష్మి సమేత తిమ్మప్ప స్వామికి అర్చకుడు సుధీంద్రనాథ్ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఆలయం ఆవరణలో విష్ణు సహస్రనామ పారాయణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.